మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 57    బుధవారం    30 - 07 - 2025    పేజీలు: 8    వెల: 4

### చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల

## కలకలంపై పవన్ కల్యాణ్ సమీక్ష



2లో..

## నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు

### కాలేదు.. కేంద్రం క్లారిటీ..



మన గళం : కేరళ నర్సు నిమిష ప్రియ కేసు క్షణానికో మలుపు తిరుగుతోంది. యెమెన్ ప్రభుత్వం నిమిష ఉరిశిక్ష రద్దుకు అంగీకరించిందని.. ఆమెకు ఊరట లభించినట్లేన వార్తలు చక్కర్లు కొడుతున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం

2

## బీహార్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా పిటీషన్లు..

- ఆగస్టు 12, 13 తేదీల్లో సుప్రీం విచారణ



మన గళం : న్యూఢిల్లీ: బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటీషన్లపై ఆగస్టు 12,13 తేదీల్లో సుప్రీంకోర్ట విచారణ చేపట్టనున్నది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఇటీవల

2

## ఓ వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది.

- తీవ్ర రక్తస్రావంతో వ్యక్తి మృతి



మన గళం : ఉత్తరప్రదేశ్ మీరట్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. ఓ వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది. సమయానికి వైద్యం అందకపోవడంతో తీవ్ర రక్తస్రావంతో

2

## ఆపరేషన్ సింధూర్‌పై లోక్‌సభలో రెండోరోజు చర్చ



మన గళం : ఆపరేషన్ సింధూర్‌పై లోక్‌సభలో రెండోరోజు చర్చ కొనసాగుతోంది. మంగళవారం లోక్‌సభలో అమిత్‌షా ప్రసంగం చేస్తున్నారు. సాయంత్రం 7 గంటలకు లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడనున్నారు. కాగా.. లోక్ సభతోపాటు.. రాజ్యసభలోనూ ఇవాళ ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు

2



# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ.. భాజపా

- ప్రపంచ దేశాలు మోదీ ఘనతను కొనియాడుతున్నాయి
- క్రమశిక్షణ, పట్టుదల పార్టీ కార్యకర్తల సొంతం
- ప్రతి గ్రామాన పార్టీ జెండా ఎగరేలా కార్యకర్తలు చూడాలి
- రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్
- ఇరిగేషన్,ఇండస్ట్రీస్ రెండు కళ్లలాంటివి వాటి సాధనకు సహకరించాలి
- రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్
- ప్రాణ త్యాగానికైనా సిద్ధపడే తత్వం కర్నూలు జిల్లా కార్యకర్తల నైజం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతాం
- ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి

(మన గళం,కర్నూలు) : ప్రపంచంలోనే భారతీయ జనతా పార్టీ అతి పెద్దదని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. గత 11 ఏళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని అత్యద్భుతంగా ముందుకు నడిపిస్తున్నారన్నారు. మోదీ ఘనతను ప్రపంచ దేశాలు వేనోళ్లా కొనియాడుతున్నాయన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక మౌర్యా ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్ లో భాజపా జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ,పట్టుదల,శ్రమ భాజపా కార్యకర్తల సొంతమన్నారు. భాజపాలో చిత్తశుద్ధి,అంకితభావాలతో పని చేయాలే గానీ ఎంతో ఎత్తుకు ఎదిగే అవకాశం ఉందన్నారు. అందుకు ఓ సాధారణ ఉపాధ్యాయుడి కొడుకైన అటల్ బిహారీ వాజపేయి, సాధారణ కుటుంబానికి చెందిన నరేంద్ర మోదీలే సాక్ష్యమన్నారు. కార్యకర్తలు ప్రతి గ్రామానా భాజపా జెండా ఎగిరేలా చూడాలని



ఆయన పిలుపునిచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్ మాట్లాడుతూ రతనాల సీమగా ఉన్న రాయలసీమ నేడు రాళ్లసీమగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.



కర్నూలు వాసులు స్థానికంగా సంపాదించిన డబ్బును హైదరాబాద్, చెన్నైలాంటి నగరాల్లో పెట్టుబడులు పెడుతున్నారన్నారు. మన ప్రాంత హక్కులను పోరాడి సాధించుకున్నామని, అయితే..ఇంకా సాధించుకోవాల్సినవి చాలానే ఉన్నాయన్నారు. కావలసినంత నీరున్నా...అవసరాలకు అక్కరకు రావడం లేదని,ఇక్కడి నుంచే నీరు ఇతర ప్రాంతాలకు వెళ్తోందన్నారు. కర్నూలు జిల్లా ప్రాంతంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఢిల్లీలో కూర్చుని ఈ

2 లో..



# ఉత్సాహం..ఉల్లాసం

- శోభాయమానంగా..శోభాయాత్ర
- వందలాదిగా తరలి వచ్చిన భాజపా నేతలు,కార్యకర్తలు
- భాజపాను తిరుగులేని శక్తిగా తయారు చేస్తా
- రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్
- ఇది ఆరంభం మాత్రమే
- రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్

(మన గళం,కర్నూలు) : ఉత్సాహం.. ఉల్లాసం.. పెల్లుబికింది. హర్షధ్వానాలు మిన్నంటాయి. మంగళవారం కర్నూలు నగరం అందుకు వేదికైంది. నగరంలోని స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి కిడ్స్ వరల్డ్, రాజవిహార్ ల మీదుగా భాజపా శ్రేణుల శోభాయాత్ర మౌర్యా ఇన్ హెూటల్ దాకా జరిగింది. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా తొలిసారి కర్నూలు నగరానికి వచ్చిన ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో కడప గడప నుంచి కర్నూలు పర్యటనకు వచ్చామన్నారు. భాజపాను ప్రతి గ్రామానికి చేరువ చేస్తామన్నారు. తన పర్యటనల్లో కార్యకర్తల నుంచి అమోఘ స్పందన లభిస్తుందన్నారు. భాజపా అధ్యక్షుడిగా పని చేసిన తన

2 లో..

## ఒరిస్సా గవర్నర్‌కు ఘన స్వాగతం




(మన గళం న్యూస్ నెట్ వర్క్) : ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు ఘన స్వాగతం లభించింది. దేశ రాజధాని ఢిల్లీ పర్యటన కు వచ్చిన ఆయన బిజెపి నేత సి.ఎం.రమేష్ నివాసానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయనకు నేత సి.ఎం.రమేష్ హృదయ పూర్వక స్వాగతం పలికి, దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పలు ప్రాధాన్య అంశాలపై వారిరువురు సుదీర్ఘంగా చర్చించారు.

### అమరావతి క్వాంటం వ్యాలీ

## ప్రయోజనాలు అందుకోండి

- సింగపూర్ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపు



మన గళం డెస్క్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రత్యేకించి విశాఖలో దీనికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సింగపూర్ లో మూడోరోజు పర్యటిస్తున్న సీఎం ఆ దేశ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల ఏర్పాటుకు విశాఖ అత్యుత్తమ ప్రదేశమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. త్వరలోనే గూగుల్ డేటా

2 లో..

# నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదు.. కేంద్రం క్లారిటీ..

మొదటి పేజీ తరువాయి

స్పందించింది. ఇవన్నీ అవాస్తవమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కాగా, భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ లీడర్ కాంతపురం ఏపీ అబూబకర్ కార్యాలయం నిమిష ఉరిశిక్ష రద్దయినట్లు ప్రకటనను విడుదల చేసింది. యెమెన్ అత్యున్నత స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో పలువురు మత పండితులు జరిపిన చర్చలు ఫలించినట్లు ప్రకటనలో పేర్కొంది. నిమిష ప్రియ మరణశిక్ష రద్దయినట్లు విస్తృతంగా ప్రచారమవుతున్న నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని తోసిపుచ్చింది. కేరళ నర్సు ఉరిశిక్షను రద్దుపై యెమెన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని స్పష్టం చేసింది. కాగా, యెమెన్ పౌరుడి హత్య కేసులో జులై 16నే నిమిషకు ఉరిశిక్ష అమలు కావాల్సి ఉండగా.. ప్రభుత్వ అధికారులు, మత పెద్దల జోక్యంతో వాయిదా పడింది. ఆమె విడుదల కోసం ఇప్పటికీ బాధిత కుటుంబం, యెమెన్ అధికారులతో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ, మృతుడు తలాల్ అబ్దో మెహదీ కుటుంబం బ్లడ్ మనీకి అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెపుతోంది. దీంతో, ఇక ముమ్ముందు నిమిష కేసు ఎలాంటి మలుపు తీసుకుంటుందోననే ఆసక్తి నెలకొంది.

# బీహార్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా పిటీషన్లు..

మొదటి పేజీ తరువాయి

ఓటర్ల జాబితాను సవరించారు. ఆ రాష్ట్రంలో ఉన్న సుమారు 65 లక్షల ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఆ ఓటర్లు బహుశా మరణించి ఉంటారని, లేదా మరో ప్రాంతానికి పర్మనెంట్‌గా మారి ఉంటారని ఎన్నికల సంఘం పేర్కొన్నది. అయితే ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఈసీ అసలైన ఓటర్లను తొలగిస్తున్నట్లు సుప్రీంలో పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్లపై ఆగస్టు 12, 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

# ఓ వైద్యుడి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయింది.

మొదటి పేజీ తరువాయి

అతడు ప్రాణాలు కోల్పోయాడు వివరాల్లోకి వెళితే.. సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు లాలా లజపతిరాయ్ మెమోరియల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆ సమయంలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ వైద్యం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఏసీ వేసుకొని నిద్రపోయాడు. బాధితులు ఎంత వేడుకున్నా నిద్రలేవలేదు. దీంతో రాత్రంతా సునీల్ ఎమర్జెన్సీ వార్డులోని స్ట్రెచర్‌పైనే రక్తస్రావంతో అల్లాడిపోయాడు. చివరికి ప్రాణాలు కోల్పోయాడు. వైద్యుడు ఏసీ ముందు టేబుల్ మీద కాలు పెట్టుకుని నిద్రిస్తున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అతడి సమీపంలోనే సునీల్ స్ట్రెచర్‌పై నొప్పిని తట్టుకోలేక అల్లాడుతూ కనిపించాడు. ఇవాళ ఉదయం 7 గంటల సమయంలో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ఈ ఘటనపై లాలా లజపతిరాయ్ మెమోరియల్ మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ జూనియర్ రెసిడెంట్ డాక్టర్ భూపేశ్ కుమార్ రాయ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు మెడికల్ కాలేజీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఆపరేషన్ సింధూర్‌పై లోక్‌సభలో రెండోరోజు చర్చ



రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడనున్నారు. కాగా.. ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం లోక్‌సభలో 16 గంటల సమయం కేటాయించారు. నిన్న చర్చను ప్రారంభించారు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్.

మొదటి పేజీ తరువాయి

ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించడానికి ఎంత దూరమైనా వెళతామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. ఆశించిన 'రాజకీయ, సైనిక లక్ష్యాల'ను చేరుకున్నందు వల్లనే 'ఆపరేషన్ సిందూర్'కు విరామం ఇచ్చామని, ఈ విషయంలో మనపై ఎలాంటి ఒత్తిడి లేదని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ మరోసారి దుస్సాహసానికి ఒడిగడితే ఈ ఆపరేషన్‌ను పునరుద్ధరిస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. వాణిజ్యంతో ఈ ఆపరేషన్‌ను అమెరికా ఏ దశలోనూ ముడిపెట్టలేదని తేల్చిచెప్పారు.

# ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ..భాజపా







ప్రాజెక్టుల కోసం నిధులివ్వాలని పోరాడదామని ఆయన కోరారు. ఇరిగేషన్,పరిశ్రమలు రెండు కళ్లలాం టివన్నా రు. వాటితోనే ప్రగతన్నది సాధ్యపడుతు ందన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి మాట్లా డుతూ భాజపాలో కర్నూలు కార్యకర్తల తీరే వేరన్నారు. అణువణువునా,నరనరానా పార్టీ సిద్ధాంతాలను రంగరిం చుకున్న కార్యకర్తలు పార్టీ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతారన్నారు. రానున్న ఎమ్పీటీసీ, జడ్పీటీసీ ,సర్పంచ్,కౌన్సిలర్,కార్పోరేటర్ ఎన్నికలేవైనా అత్యధిక సీట్లను గెలుస్తామని, గెలిచి రాష్ట్ర భాజపా నూతన అధ్యక్షుడిగా నియమితులైన పి.వి.ఎన్. మాధవ్ కు కానుకగా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పురుషో త్తం రెడ్డి, కర్నూలు,నంద్యాల జిల్లాల అధ్యక్షులు రామక్రిష్ణ, అభిరుచి మధు, చంద్రమౌళి, అంకాల్ రెడ్డి, శివనారా యణ, బ్రహ్మారెడ్డి, ప్రకాష్ జైన్, రామస్వామి, సావిత్రమ్మ, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, గీతామాధురి,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



# ఉత్సాహం..ఉల్లాసం

తండ్రి నుంచి వారసత్వంగా పొందిన సైద్ధాంతిక భావజాలంతో పార్టీని కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుగులేని శక్తిగా తయారు చేస్తానని ఆయన స్పష్టం చేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టి.జి.వెంకటేష్ మాట్లాడుతూ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ఎన్డీయే కూటమి బలపడిందన్న వాస్తవం తేటతెల్లమవుతోందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనన్నారు. ఈ ర్యాలీలో భాజపా కర్నూలు,నంద్యాల జిల్లాల అధ్యక్షులు రామక్రిష్ణ, అభిరుచి మధు,భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అమరావతి క్వాంటం వ్యాలీ ప్రయోజనాలు అందుకోండి

సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు తెలియచేశారు. అలాగే టీసీఎస్, కాగ్నిజెంట్ సహా వివిధ ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖలో తమ సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. అలాగే దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నామని... 2026 జనవరి నాటికి ప్రారంభమయ్యే క్వాంటం వ్యాలీ ఎకో సిస్టంలో సింగపూర్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ప్రయోజనాలను సింగపూర్ కంపెనీలు పొందటంతో పాటు పరిశోధనలకూ ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలంగా 20కి పైగా పాలసీలను అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. పారిశ్రామిక అనుకూల విధానాలతో పాటు పెట్టుబడులకు ఉన్న అవకాశాలను రౌండ్ టేబుల్ వేదికగా ముఖ్యమంత్రి సింగపూర్ పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి.నారాయణ, ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**- ఏపీ గ్రోత్ ఇంజిన్ గా విశాఖ**

నగరాభివృద్ధి, వాణిజ్య సదుపాయాలు, మౌలిక వసతుల రంగాల్లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన సింగపూర్‌కు చెందిన కెప్పెల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిమ్ యాంగ్ వియ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. సింగపూర్ లో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం వివిధ పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో భేటీ అయ్యారు. అమరావతి నగర అభివృద్ధిలో కెప్పెల్ భాగస్వామ్యంపై ప్రధానంగా ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రాభివృద్ధి కోసం విశాఖను గ్రోత్ ఇంజిన్‌గా మార్చే లక్ష్యంతో ఐటీ, వాణిజ్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి కెప్పెల్‌ను ఆహ్వానించారు.

**- జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం లక్ష్యం**

అమరావతి నగర అభివృద్ధి, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పరిశ్రమల రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్ (జీఐసీ) సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ బ్రాన్ యోతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. జీఐసీతో దీర్ఘకాలిక భాగస్వామ్యం, స్థిరమైన పెట్టుబడులపై ప్రణాళికల రూపకల్పనపై చర్చించారు. వైద్య, విద్య, పట్టణ ప్రణాళిక, పౌర సదుపాయాలు వంటి రంగాల్లో జీఐసీ పెట్టుబడులు పెట్టేలా అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం స్పష్టం చేశారు.

**- ఫుడ్ ప్రాసెసింగ్‌పై విల్మర్ ఆసక్తి**

అలాగే, విల్మార్ ఇంటర్నేషనల్ సంస్థ గ్రూప్ హెడ్ రాహుల్ కలేతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్, ఎడిబుల్ ఆయిల్స్, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. రైతులకు విలువ ఆధారిత మార్కెట్‌ను కల్పించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో సహకరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించగా విల్మర్ టెక్నాలజీ అందుకు ఆసక్తి వ్యక్తం చేసింది.

**- సింగపూర్ ప్రభుత్వం నుంచి కీలక ప్రకటన**

సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్దంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్ సీ లెంగ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

**- ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది**

వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్ సీ లెంగ్ కు ఎక్స్ వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. వివిధ రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్ సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సీఎం పేర్కొన్నారు.

### చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల

# కలకలంపై పవన్ కల్యాణ్ సమీక్ష

**- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల దాడులు**

**- ఇటీవలే ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి**

**- నిన్న తిరుపతి శ్రీవారి మెట్టు మార్గం వద్ద ఏనుగుల సంచారం**

మన గళం, అమరావతి : గత కొన్నేళ్లుగా ఏనుగులు అటవీ ప్రాంతాలను వదిలి జనావాసాల్లోకి ప్రవేశిస్తూ, పొలాల్లో పనిచేసుకుంటున్న వారిపై దాడులు చేసి చంపేస్తుండడం తెలిసిందే. ఏపీలోనూ ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. ఇటీవలే చిత్తూరు జిల్లాలో రామకృష్ణంరాజు అనే రైతు ఏనుగుల దాడిలో బలయ్యాడు. నిన్న సోమవారం కూడా తిరుపతి శ్రీవారి మెట్టు మార్గంలో పంప్ హౌస్ వద్ద ఏనుగులు కనిపించాయి. సమీపంలోని పొలాలను ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో, ఏపీ డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. తన శాఖ అధికారులు ఆయన ఇవాళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏనుగుల గుంపులు పొలాలపైకి రాకుండా, వాటిని అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఏనుగుల సంచారం ఉండే ప్రాంతాల్లో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తుండాలని, గ్రామస్తులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఏనుగుల తాకిడిపై వారికి ముందుగా సమాచారం అందిస్తుండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏనుగుల ప్రభావిత గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని సూచించారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# స్థాయి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. 7 మంది కార్పొరేటర్లు నామినేషన్లు వేయగా, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ఇద్దరూ అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 5 స్థానాలకు ఐదుగురే బరిలో ఉండటంతో ఎన్నికలు ఏకగ్రీవంగా కానున్నారు. ఆగస్టు 1న అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అహమ్మద్ షేక్, ఇప్పల నారాయణ రెడ్డి, కురువ మునెమ్మ, వై వెంకటేశ్వర్లు, చెన్నబోయిన సాంబశివ రావు బరిలో ఉన్నారు.

# లక్ష్యాలను సాధించాలి



– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మనగళం, కర్నూలు సిటీ : స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ శాఖల పనితీరు సూచికల లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో%శ్రీశ్రీ% స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ – కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాల సాధన అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ అమలులో భాగంగా ప్రతి సంవత్సరం 15% అభివృద్ధిని సాధించేందుకు వీలుగా ఆయా శాఖల అభివృద్ధి లక్ష్యాలతో కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను నిర్దేశించడం జరిగిం దన్నారు. ఇందుకు సంబంధించి ఆయా శాఖలు గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలను పోర్టల్ లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే 2025–26 సంవత్సరానికి నిర్దేశించబడిన నెల, త్రైమాసం, అర్ధ సంవత్సరం, సంవత్సర లక్ష్యాలను కూడా పొందుపరచాలన్నారు. అదే విధంగా జిల్లా కు నిర్దేశించిన టార్గెట్ లను మండల వారీగా విభజించి పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 8 వ తేదీ లోపు మండల స్థాయి డేటా ఎంట్రీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, సీపీఓ హిమ ప్రభాకర్ రాజు, ఏడీ భారతి పోర్టల్ లో పనితీరు సూచికల లక్ష్యాలను ఏ విధంగా పొందుపరచాలన్న విధానాన్ని మార్గదర్శనం చేశారు. సమావేశంలో ఎస్ ఈ ఉమాపతి, జడ్పీ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీడబ్ల్యుఎంఏ పీడీ వెంకట రమణయ్య, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసిన ఎంపీ, కర్నూలు జిల్లాలోని విద్యా రంగం సమస్యల పై చర్చించారు. ఈ సందర్బంగా జిల్లాలో విద్యాభివృద్ధికి సహకరించాలని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను ఎంపీ నాగరాజు కోరారు. అదేవిధంగా జిల్లాలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

# నెల్లూరు సీఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలి




మనగళం, కర్నూలు సిటీ: రాష్ట్రంలో మున్సిపల్ వర్కర్స్ ను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పరాదని కోరుతూ నెల్లూరులో 14 రోజులుగా పోరాటం చేస్తున్న మున్సిపల్ కార్మికులపై అమానుషంగా లాటి చార్జి చేయించిన నెల్లూరు టౌన్ సీఐ శ్రీనివాసరావును వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఓల్డ్ సిటీ కమిటీ కర్నూలు ఆధ్వర్యంలో మంగళవారం గడియారం హాస్పిటల్ ముందు కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు రాజశేఖర్, నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు మాట్లాడారు. పేద ప్రజలకు, కార్మికులకు, ఉద్యోగులకు అనేక వాగ్దానాలు చేసినందున నమ్మిన ప్రజలు, కార్మికులు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని తెలిపారు. కూటమి పెద్దలు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను... మీరు కరోనా వారియర్స్ అని పూలు చల్లి ఘనంగా సన్మానించి పర్మినెంట్ చేస్తా అని మోసం చేసి%శీ%దని, ప్రస్తుత కూటమి సర్కార్ సైతం కార్మికులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. హక్కుల సాధనకు 14 రోజులుగా పోరాటం చేస్తూ ఉంటే సహించలేని ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో పోటీ కార్మికులను తెచ్చి పారిశుద్ధ్య కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మా కడుపు కొట్టొదని అడిగిన పాపానికి పోలీసుల ద్వారా లాఠీచార్జి చేయించి, మద్దతుగా ఉన్న సీఐటీయూ నాయకులను దుర్భాషలాడిని సీఐ శ్రీనివాసరావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ కాజా పాష, నాయకులు నాగస్వాములు, షరీఫ్, షేక్షా, పార్వతయ్య, చాంద్ బాషా, శివ, ఇక్బాల్, బాషా, మరియు కార్మికులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పారిశుద్ధ్య పనులను ఫిర్యాదులు రాకుండా పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వెంకటరమణ కాలనీ, ప్రకాష్ నగర్, రోజవీధి, అశోక్ నగర్, బంగారుపేట, చల్లా కాంపౌండ్ ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వారానికొకసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ కాలువలపై ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పైపులు, ఇతరత్రా ఆటంకాలు ఉంటే ఇంజనీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఏఈ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# కంప చెట్లను తొలగించాలి



మనగళం, కర్నూలు సిటీ : స్థానిక బుధవార్ పేట 15వ వార్డు కొత్త బ్రిడ్జిని కంపచెట్లను స్మశానం వరకు తొలగించాలని సీపీఎం వార్డు పర్యటన సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే రామకృష్ణ, నగర్ కమిటీ సభ్యులు ఆర్ కృష్ణ, సీనియర్ నాయకులు కే రాముడు మాట్లాడారు. బుధవార్ పేట దళిత నీరు పేద ప్రజలు అయినా హంద్రీ వెంబడి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. రాత్రుల నిద్రించే సమయంలో పాములు తేలు వస్తున్నాయని ప్రజలు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీ వెంబడి ఉండే కంప చెట్లను ఇతర పిచ్చి మొక్కలు తొలగించి ప్రజలను ఆదుకోవాలని అధికారులను వారు కోరారు.

# బీసీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు




మనగళం, కర్నూలు సిటీ : బీసీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వైసీపీ బీసీ సెల్ కర్నూలు జిల్లాఅధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 3,700 సంక్షేమ హాస్టల్లో నాడు నేడు ద్వారా అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. మంచి భోజనం, సక్రమమైన వసతులు కల్పించడం జరిగిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ కూటమి సర్కార్ ప్రజలని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

# ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని అమలు చేయాలి

– అన్ని శాఖలు సమన్వయంతో ఫలితాలు సాధించాలి
– ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డా.పి.కృష్ణయ్య



మనగళం, కర్నూలు సిటీ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని అమలు చేయాలని, అన్ని శాఖలు బాధ్యత తీసుకుని ఫలితాలను సాధించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.పి.కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తో కలిసి స్టేక్ హోల్డర్ విభాగాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు చాలా ప్రమాద కరమని, అక్టోబర్ 2 లోపు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేలా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి నెల మూడవ శనివారం క్షేత్ర స్థాయిలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నారంటే, ఈ కార్యక్రమానికి ఎంత ప్రాధాన్యత ఉందో అధికారులు గుర్తించాలన్నారు. పట్టణాలు, నగరాల్లో జనాభా ఎక్కువగా ఉండడం వల్ల సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని, మున్సిపల్ కమిషనర్లు ఈ అంశంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఫంక్షన్ హాల్ లు, కళ్యాణ మండపాలు, ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, ఆస్పత్రులు, కూరగాయల మార్కెట్ లు, దేవాలయాల్లో, హోటల్స్, చికెన్ షాపులు తదితర ఎక్కువ జనాభా వచ్చే ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగ్ లు, బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచులను అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, ఎంఎస్ఎమ్ఈ ల ద్వారా జ్యూట్ బ్యాగ్, బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచుల ఉత్పతి చేసేందుకు చిన్న చిన్న యూనిట్ లు ఏర్పాటు చేసేందుకు ప్రమోట్ చేయాలని ఛైర్మన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ 2 వ తేది నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.. జూన్ 5 వ తేదీ నుండి ప్లాస్టిక్ వాడకం పై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సదస్సులు నిర్వహించడం జరుగుతోందన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, గనుల శాఖ డీడీ రవిచంద్, డీఎస్ ఓ రఘువీర్, డీపీఓ భాస్కర్, డీటీసీ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : ప్రభుత్వ మున్సిపాలిటీ స్కూల్స్ లలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర నాయకులు రాజశేఖర్, అబ్దుల్ దేశాయ్, నాగస్వాములు, చాంద్ బాషా డిమాండ్ చేశారు. సీపీఎ స్కూల్ పర్యటనలో భాగంగా మంగళవారం నాయకులు ఎంపీఎల్, ఉర్దూ హై స్కూల్ ను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన కొత్త బిల్డింగ్ లను పూర్తి చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. టీచర్ల, తరగతి గదుల కొరతతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు సిటీ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చేసే కార్యక్రమం అయినప్పటికీ, అత్యంత జాగ్రత్తగా చేయాల్సి ఉంటుందని తెలిపారు. షామియానా, ఆహ్వాన పత్రికల ముద్రణ తదితర ఏర్పాట్లతో పాటు ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లను చూసుకోవాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ ను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. అన్ని శాఖల నుండి ప్రభుత్వ పథకాల వివరాలను తీసుకొని ప్రసంగం తయారు చేయాలని, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాట్లను చూసుకోవాలని సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. ఎక్కువ సేపు పిల్లలు ఎండలో నిలబడకుండా 45 నిమిషాల లోపు సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఈఓ ను ఆదేశించారు. బ్యారికేడింగ్ వంటి ఏర్పాట్లతో పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ ను వేడుకలకు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, పరేడ్ నిర్వహణకు పోలీస్ శాఖ ఏర్పాట్లను చేయాలన్నారు. పెరేడ్ గ్రౌండ్స్ లో తాగు నీటి ఏర్పాట్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, డీఆర్ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన హఫీజ్ ఖాన్



మనగళం, కర్నూలు: తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన వైసీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్ ను హఫీజ్ ఖాన్ మర్యాద పూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను వివరించినట్లు హఫీజ్ ఖాన్ తెలిపారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి

మనగళం, కర్నూలు : ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతోపాటు వాటిని బాధ్యతగా సంక్షించాలని బీజేపీ రాష్ట్ర రథసారథి పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లాకు వచ్చిన ఆయన... కోడుమూరు రూరల్ అధ్యక్షుడు బేస్తఈరన్న ఆధ్వర్యంలో కేశవరెడ్డి స్కూల్ ఆవరణలో వృక్షో రక్షతి రక్షితః మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ చెట్లను మనం కాపాడితే అవి మన జల జివా రాశులను కాపాడుతాయని చెప్పారు. ఎస్టీబీసీ కాలేజ్ ఆవరణలో చర్చ కార్యక్రమం అనంతరం మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుండి మౌర్య ఇన్ వరకు ర్యాలీ సాగింది. పార్టీ నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జిల్లా ఇన్చార్జి అంకల్ రెడ్డి చంద్రమౌళి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగురూరురాఘవేంద్ర, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, నాయకులు రామస్వామి, గీతామాధురి, గోపాలకృష్ణశర్మ, కోటియాదవ్, లోకేశ్వరయ్య, మంజునాథ్, ఈపూరి నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 5న వామపక్ష పార్టీల ఆందోళనలు




మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్టు మీటర్లుకు వ్యతిరేకంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో ఆగస్టు 5 న రాష్ట్రవ్యాప్తంగా జరుగు ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు విరుపాక్షి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్త ఆందోళన విజయవంతం చేయడంతో పాటు ఆగస్టు 9,10 తేదీలలోకర్నూలు లో జరుగు సీపీఐ 24 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఎన్నికల ముందు టీడీపీ నాయకుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల వ్యతిరేకించడమే కాకుండా పగుల కొట్టాలని చెప్పారని, ఇప్పుడేమో పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు విఫలం చెందారన్నారు. జిల్లా మహాసభల సందర్భంగా ఆగస్టు 9న కర్నూలు నగరంలో పెద్దఎత్తున ప్రదర్శన ఉంటుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, ఆహ్వానసంఘం అధ్యక్షులు కె జగన్నాథం మాట్లాడుతూ మహాసభల సందర్భంగా పట్టణం మొత్తం ఎర్రజెండాలు, తోరణాలతో ఎరుపుమయం చేయడమే కాకుండా ప్రదర్శనలో కదంతొక్కాలన్నారు. మహాసభల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నివాసస్థలం లేని నిరుపేదలకు గ్రామీణప్రాంతంలో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట ఇండ్ల స్థలాల సాధన, జిల్లాలో మౌలిక వసతుల కల్పన కోసం చేయాల్సిన పోరాటాలపై భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, నక్కి లెనిన్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, పూర్వపు జిల్లా కార్యదర్శి భీమ లింగప్ప, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, రామకృష్ణారెడ్డి,రాజా సాహెబ్, మద్దిలేటి శెట్టి, రంగన్న, భాస్కర్ యాదవ్, జి చంద్రశేఖర్, శ్రీరాములు, నగర సహాయ కార్యదర్సులు సి మహేష్, డి శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాపీర్, జిల్లా సమితి సభ్యులు సుదర్శనం, రాజీవ్, రామాంజనేయులు, రాజు, సులోచనమ్మ, రామంజి,, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నాగరాజ కుమార్ సారథ్యంలో తొలి అడుగు కార్యక్రమం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : మామిడి నాగరాజ కుమార్ సారథ్యంలో మంగళవారం 25, 29 బూత్ లో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. 37వ వార్డు ఇన్చార్జ్ మామిడి ఉషారాణి, మామిడి నాగరాజు కుమార్, షేక్ షబ్బీర్ బాషా, లక్ష్మీనారాయణ, షేక్ ఖలీల్, జ్యోతి, అల్లా, ప్రకాష్, ఉమా, కాంతయ్య తదిర నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కార్ అమలు చేసిన,చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



# చిన్న వర్షానికే ప్రమాదకరంగా అండర్ బ్రిడ్జీలు






మన గళం, ?కర్నూలు సిటీ : కర్నూలు నగరంలో చిన్నపాటి వర్షానికే అండర్ బ్రిడ్జీలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రత్యేకించి కర్నూలులోని కృష్ణ నగర్ కోట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అండర్ బ్రిడ్జీ నిత్యం సమస్యగా మారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ అండర్ బ్రిడ్జీ పూర్తిగా జలమయం అవుతుంది. దీనికి తోడు సమీపంలోని కాలువ నీరు కూడా చేరి దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ బ్రిడ్జీ గుండా వెళ్లే మార్గం పూర్తిగా నీటితో నిండిపోయి ఉంది. ఈ మార్గం గుండా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి లోతు ఎక్కువగా ఉండటం కాలువలలోని కొచ్చి బయటికి రావడంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయే ప్రమాదం లేకపోలేదు. దుర్గంధం కారణంగా ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ?ప్రతీ చిన్న వర్షానికే ఈ పరిస్థితి తలెత్తుతుండటంతో, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి పారుదలకు సరైన కాల్వలు లేకపోవడం, అండర్ బ్రిడ్జీ వద్ద నీరు నిలిచిపోకుండా చూసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం మూలంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ?ముఖ్యంగా, రైల్వే స్టేషన్ సమీపంలో ఉండటంతో, ఈ అండర్ బ్రిడ్జీ గుండా నిత్యం వందలాది మంది ప్రయాణికులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ముఖ్యమైన మార్గంలో నీరు నిలిచిపోవడం, అది కూడా మురుగునీటితో కూడి ఉండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ?సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, కృష్ణ నగర్ కోట్ల రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# రాత్రి వేళ గస్తీ పటిష్టం

– లాడ్జిలలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు





మనగళం, మంగళవారం, కర్నూలు క్రైం : నేరాల నియంత్రణకు కృషి చేయాలన్న కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులను రాత్రివేళల్లో గస్తీ పటిష్టం చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా అనుమానం వ్యక్త పరిచిన వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జిలలో రాత్రి బస చేసే వ్యక్తుల గుర్తింపు కార్డులు తీసుకొని వివరాలు నమోదు చేయాలన్నారు. పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సీపీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని లాడ్జీల యజమానులకు పోలీసులు సూచించారు.

# వాహనాల తనిఖీ

మనగళం, కర్నూలు క్రైం : విజిబుల్ పోలీసింగ్ ను బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూల్ పోలీసులు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రత మరియు రక్షణలో భాగంగా అన్ని ముఖ్య కూడళ్లు, జనం రద్దీగా ఉండే ప్రదేశాలు, రహదారులపై సంచరిస్తూ పోలీసు పెట్రోలింగ్ చేస్తూ గస్తీ నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాల కట్టడిపై నిఘా, రోడ్డు సేఫ్టీ నియమాలపై ప్రజల్లో అవగాహన, తదితర చర్యలు చేపట్టారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## వ్యవసాయ మెలకువలపై రైతులకు శిక్షణ ..



మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని అవుకు 2 రైతు సేవా కేంద్రంలో నంద్యాల జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య మంగళవారం రైతులకు వ్యవసాయంపై మెలకువలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య వరిలో జింక్ లోపం గురించి రైతులకు సమగ్రంగా వివరించదడ%శీ% జరిగింది. అలాగే మినుము పంట లో యాజమాన్య పద్ధతులను వివరించడం జరిగింది. మొక్కజొన్న సాగు మరియు మెలకువలు కూడా వివరించడం జరిగినది. అలాగే రైతులు యూరియా, డిఎపి వాడకం తగ్గించి రైతులు నానో యూరియా, నానో డీఏపీ లు వాడాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు సమీప రైతుసేవ కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలి అని తెలియజేశారు. ప్రకృతి వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనుల గురించి వివరించడం జరిగింది. వెటర్నరీ డాక్టర్ భారతిదేవి మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా పెయ్య దూడల ఎద సూదుల పథకం అందుబాటులో ఉంది అని తెలియజేశారు. ఒకప్పుడు ఈ పథకం 500 రూపాయలు ఉండేది కానీ 150 రూపాయలకు తగ్గించడం అయినదని తెలియజేశారు. అలాగే మినీ గోకులం ఎవరికైనా కావాలి అంటే సమీపంలోని వెటర్నరీ అసిస్టెంట్లను సంప్రదించాలి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వనరుల కేంద్రం సాయిబాబా చాలకులు, ప్రకృతి వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి వివిధ గ్రామాల రైతులు, అవుకు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొనడం జరిగింది.


## పంటలకు ఇన్సూరెన్స్ చాలా ముఖ్యం. వ్యవసాయ అధికారి జ్యోతి



మన గళం సంజామల : పంటలకు ఇన్సూరెన్స్ చాలా ముఖ్యమని సంజామల మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి మంగళవారం అన్నారు. ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తుంది లో భాగంగా మండలంలోని ముక్కమల్ల గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బి .జ్యోతి మాట్లాడుతూ వరికి ఆగస్టు 15 మిగతా పంటలకు ఆగస్టు 31 లోపు పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి. మొక్కజొన్న పంటలలో సాగు పద్ధతుల గురించి పురుగు తెగుళ్ల గురించి రైతులకు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట నమోదు ప్రక్రియ మొదలైంది ఖరీఫ్ సీజన్ లో రైతులు ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు ఆ పంటకు సంబంధించి వివరాలను రైతు సేవ కేంద్రం సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, విఏఏ నరేష్ రైతులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయండి..మంత్రి బిసి





మన గళం బనగానపల్లె : నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో జురెరు వాగు సమీపంలో బంగారమ్మ తోట సమీపాన నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం డ్రైనేజీ నిర్మాణం పనులను పరిశీలించడానికి వెళ్లిన మంత్రికి బంగారమ్మ తోట వద్ద వీధుల్లో మౌలిక సదుపాయాలు లేవంటూ స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగింది. సమస్యలను విన్న మంత్రి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది .అలాగే తక్షణమే విద్యుత్తు, త్రాగునీరు ,మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

## ఇంటి స్థలాలు హామీ మరిచిన ముఖ్యమంత్రి-పేదల ఇంటి స్థలాల కై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి:- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

మన గళండోన్ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి గారు అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం దాటిపోయిన పేదలకు ఇచ్చిన హామీ మరచి రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను కారు చౌకగా బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పచెప్పుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ ఆరోపించారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని పట్టణంలోని పేద ప్రజలతో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలు వేలాది మంది డోన్ పట్టణంలో ఉన్న ఇండ్లకు అద్దెలు కట్టలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎన్నికలకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు రెండు సెంట్లు స్థలం ఇస్తామన్న హామీని నమ్మి కూటమి ప్రభుత్వాన్నికి పేద ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇచ్చారని వారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పేద ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడం లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ ప్రభుత్వ భూములను కారు చౌకగా ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీల పెట్టుబడిదారులకు కారు చౌకగా ధారా దత్తం చేస్తూ సుపరిపాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయవలసిన బాధ్యత కలిగిన స్థాయిలో ఉన్న అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి విమర్శలతో ప్రజల గొంతుకలను నొక్కలనే ప్రయత్నం చేయడం వారి అవివేకానికి నిదర్శనమని వారన్నారు.ఇప్పటికైనా పేద ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలను సమీకరించి ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో




సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు చిన్న రహిమాన్, శివరాం,భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య,ఐద్వా నాయకురాలు షమీం బేగం, సిరినా,సూర్య పద్మ,షబానా, చాముండేశ్వరి,మాధవి, భూలక్ష్మి,లక్ష్మీదేవి,విద్యార్థి యువజన సంఘం నాయకులు నక్కి హరి,అశోక్, కెవిపిఎస్ నాయకులు రాజ్ కుమార్,ఖాదర్ వలీ లతోపాటు ఇల్లు లేని 250 మంది నిరుపేదలు పాల్గొనడం జరిగింది.అనంతరం పేద ప్రజలు తీసుకువచ్చిన ఇండ్ల స్థలాల అర్జీలను డిప్యూటీ తాహసిల్దార్ సునీల్ రాజు కి అందించడం జరిగింది.




## చిన్నపిల్లలకు బైకులు ఇవ్వవద్దు తల్లిదండ్రులకు హెచ్చరిక రూరల్ సిఐ సీఎం రాకేష్.

మన గళండోన్ మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ సీఎం రాకేష్, ఎస్సై మమత వారి సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి 8 గంటల నుంచి 9:30 గంటల వరకు సైబర్ నేరాలపై మరియు రోడ్డు ప్రమాదాల నివారణ మహిళా రక్షణ మత్తు పదార్థాలు బాల్యవివాహాల వలన కలిగే నష్టాలపై డెమో రూపకంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ సీఎం రాకేష్ మాట్లాడుతూ ఆన్లైన్లో తెలియని వెబ్సైట్లను ఓపెన్ చేయకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. 18 సంవత్సరాలు దాటని చిన్నపిల్లలకు బైకులు ఇవ్వవద్దని తెలిపారు. 19 సంవత్సరాలు నిండిన యువకులకు లైసెన్సులు ఇప్పిస్తామని చలానా మీ సేవ ద్వారా చెల్లించాలని తెలిపారు. ఈ యొక్క అవకాశాన్ని ఈ గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రామంలో వీధులు విధులు తిరిగి సీసీ కెమెరాలు యొక్క



పనితీరును రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ పై గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబానికి తెలిపారు. చిన్న చిన్న సమస్యలపై కొట్లాడకుండా పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని అన్నారు. గ్రామంలోని ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్నటువంటి హైస్కూల్ను నెలలో రెండుసార్లు విజిట్ చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అత్యవసర సమయంలో 100,112కు కాల్



చేస్తే తక్షణ పోలీసు సహాయం పొందవచ్చు అన్నారు. రోడ్డు ప్రమాదంలు జరిగినప్పుడు 108 కి కాల్ చేస్తే అంబులెన్స్ వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సై వారి సిబ్బంది గ్రామస్తులు మహిళలు పిల్లలు వృద్దులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డోన్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు సాంకేతిక ప్రాబ్లం వలన మూడు రోజుల నుండి వినియోగదారులకు సేవలు నిలిచిపోయాయి

- విద్యార్థులు వృద్ధులు మహిళలు వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారు
- నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు సాంకేతిక ప్రాబ్లం ను తొలగించమని పోస్టల్ అధికారులకు అభ్యర్థించారు

మన గళండోన్ డోన్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు వినియోగదారుల ఫిర్యాదు మేరకు పోస్ట్ ఆఫీస్ ను సందర్శించడం జరిగినది. మూడు రోజుల నుండి రిజిస్టర్ పోస్టులు ఆధార్ ఎన్రోల్మెంట్ సెంటర్ క్యాష్ కౌంటర్స్ పొదుపు బీమా తదితర సేవలు సాంకేతిక ప్రాబ్లం వలన వినియోగదారులకు సేవలు నిలిచిపోయాయని వినియోగదారులు ఫిర్యాదు చేయడం జరిగినది. ఫిర్యాదుదారుడు వెంకటేశ్వరుల గౌడు సేగు హరినాథ్ శెట్టి గత మూడు రోజుల నుండి ప్రతిరోజు రిజిస్టర్ పోస్టుల రూపంలో పోస్ట్ ఆఫీస్ నాకు రావడం జరుగుతుందని తమరి పనులు అన్ని విడిచిపెట్టి రావడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు కరెంటు పోతే కూడా జనరేటర్ పనిచేయడం లేదని గత కొద్ది సంవత్సరాల నుండి పోస్టల్ సూపర్డెంట్ కి ఎన్నో వినతి పత్రాలు అందించామని ఇంతవరకు జనరేటర్ ని రిపేర్ చేయించలేదని వెంటనే జనరేటర్ కూడా రిపేరి చేసి ప్రారంభించాలని కోరుతూ సాంకేతిక ప్రాబ్లంను వెంటనే పోస్టుల అధికారులు పరిష్కరించి



వినియోగదారులకు సేవలను అందించాలని ఈ సందర్భంగా ఏఈ నాగరాజు ఒక ప్రకటన రూపేనా తెలియజేశారు

## అంతర్జాతీయ పులుల దినోత్సవము సందర్భంగా అవగాహన ర్యాలి లో పాల్గొన శ్రీశైలం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పి.రామకోటి బి. సి. స్కూల్ ప్రిన్సిపాల్ జవహర్

మనగలం :శ్రీశైలం ప్రాజెక్ట్ :సున్నిపెంట లో 29 వ తేదీన డివిజినల్ అటవీ అధికారి, వన్య ప్రాణి విభాగము. ఆత్మకూరు వారి ఉత్తర్వుల మేరకు శ్రీశైలం రేంజి సున్నీ పెంట్ నందు "అంతర్జాతీయ పులుల దినోత్సవమును" జరుపుకోవడమైనది. ఇందులో భాగముగా బి.సి స్కూల్ విద్యార్థులచే బయో పార్క్ మరియు హటకేశ్వరం నందు ప్లాంటేషన్ ప్రోగ్రాము, రేంజ్ ఆఫీసు నుండి సున్ని పెంట బస్టాండ్ వరకు అవగాహన ర్యాలి మరియు ప్లాస్టిక్ క్లీనింగ్ ప్రోగ్రాము సాక్షి గణపతి మరియు శిఖరం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో శ్రీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీశైలం వారు మాట్లాడుతూ బి.సి స్కూల్ విద్యార్థులకు పులుల గురించి అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు అడవులను కాపాడటం మన అందరి భాధ్యత, అందులోని వన్య ప్రాణులను కాపాడవలనని అవశ్యకత ఎంతైనా వుందని వారికీ. తెలియజేయడమైనది. ఇందులో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, శ్రీశైలం శ్రీ.రామకోటి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీ . బషీర్ అహమ్మద్, బి.సి స్కూల్ ప్రిన్సిపాల్ . జవహర్ వారి ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ శ్రీ . మదన్ కుమార్, శ్రీ కె.జయరాజూ, శ్రీ .పెద్దయ్య, ఫారెస్ట్ బీట్



ఆఫీసర్ శ్రీ.సలాం అల్లా, శ్రీ . శ్రీరాములు,చైర్ పర్సన్స్ శ్రీ .నాగేశ్వరరావు, . మల్లయ్య, శ్రీశైలం రేంజ్ స్టాఫ్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక
నంద్యాల న్యూస్
బుధవారం
30 - 07 - 2025


# జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలి




- ప్రతి ఇంటిపై సోలార్ వెలుగులు నింపాలి
- ప్రజలకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా నంద్యాల జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పీఎం సూర్య ఘర్ పథకంపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్ లు, ఎంపీడీవోలు, ఏపీఎం లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రతి ఒక్కరూ పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ పథకం ద్వారా ఆదాయం పెరగడంతో పాటు పొల్యూషన్ నివారించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఒకసారి ఇంటి పై కప్పులపై సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 25 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదన్నారు. ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి అయితే ప్రభుత్వానికి అమ్మవచ్చని, కరెంటు పోతుందనే టెన్షన్ ఉండదన్నారు. ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, గ్రామాలకు వెళ్లి ప్రజాప్రతినిధులను ఎంపీటీసీ, జడ్పీటీసీ తదితర నాయకులకు కలిసి ప్రతి ఇంటి రూఫ్ టాప్ పైన సోలార్ సిస్టం ఇన్స్టాల్ చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఒక్కొక్క నియోజకవర్గానికి 10 వేలు టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి 70 వేల టార్గెట్ చేయాల్సి ఉందన్నారు.

ఈ పథకం ద్వారా ఒక కిలో వాట్ కు 30 వేల సబ్సిడీ, 2, కిలో వాట్స్ కి 60 వేలు, 3 కిలో వాట్స్ కి 78, వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు 100% సబ్సిడీ ఉంటుందన్నారు. మంచి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని రాబోయే రోజులలో నంద్యాల జిల్లాను సోలార్ వెలుగులతో నింపి దేశంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

# మెరుగైన భవిష్యత్తుకు సహకార సంఘాలు పునాది



- నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

మనగళం, నంద్యాల: మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి సహకార సంఘాలు పునాది లాంటివని, జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీసీ హాల్ నందు జిల్లా కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 56 కో-ఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయన్నారు. సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రతి గ్రామానికి సొసైటీ సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా నాబార్డు, డిసిసిబి లు ఫైనాన్షియల్ గా సపోర్ట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్స్ రైతుల అవసరం మేరకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండిస్తున్న పంటలకు అనవసరంగా యూరియా వాడకూడదని యూరియా ఎక్కువగా వాడటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరాకు రెండు బ్యాగులు మాత్రమే యూరియా వాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, నాబార్డు డిడిఎం కార్తికేయ, డిసిసిబి శివలీల, జెడి ఫిషరీస్, జెడి పశుసంవర్ధక శాఖ, తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ కార్డ్స్ పంపిణీ చేసిన అచ్చంపేట ఎమ్మెల్యేడాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మనగలం : బ్రహ్మగిరి : ఈరోజు ఉమ్మడి అమ్రాబాద్, మండలాల వ్యాప్తంగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారి చేతుల మీదుగా బ్రహ్మగిరి గ్రామ ప్రజలందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది,, ఈ సందర్భంగా రేషన్ కార్డులు పొందిన వారందరూ ఈ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ,మరియు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారికి మరియు అమ్రాబాద్ మండలం ఎమ్మార్వో గారికి రెవెన్యూ డిపార్ట్మెంట్ కి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

# కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



మనగళం, నంద్యాల: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతో అమలవుతున్న పథకాలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పరిశీలించడానికి జిల్లాకు విచ్చేసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ కేంద్ర బృందం (ఎన్ఎల్ఎం), జిల్లా అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో ఆయా శాఖల ద్వారా అమలవుతున్న వివిధ పథకాలను పరిశీలించడానికి సంతోష్ ఫరీదా నేతృత్వంలో ఈనెల 19 నుంచి నేటి వరకు జాతీయ స్థాయి పర్యవేక్షణ కేంద్ర బృందం పర్యటించిందన్నారు. ఉయ్యాలవాడ, జూపాడుబంగ్లా, నంద్యాల మండలంలోని పాంపల్లి, గోవిందపల్లి, జంబులదిన్నె, పారుమంచాల, జూపాడుబంగ్లా, లింగందిన్నె, భీమావరం, బిల్లలాపురం గ్రామపంచాయతీలను ఈ బృందం సభ్యులు సందర్శించి వివిధ కేంద్ర పథకాల కింద అమలవుతున్న పనులను పరిశీలించారన్నారు. కేంద్ర ప్రభుత్వ పనులను పరిశీలించి, వాటిలో గుర్తించిన విధానపరమైన అంశాలను కలెక్టర్ సమక్షంలో హాజరైన సంబంధిత శాఖల అధికారులతో బృందం సభ్యులు చర్చించారు. పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపై పలు సలహాలు, సూచనలు జారీ చేశారు. జాతీయస్థాయి పర్యవేక్షణ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, సూచించిన మేరకు పథకాలను అమలు పరచడంలో ఎలాంటి విధానపరమైన లోపాలు లేకుండా సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు నియమ నిబంధనలకు అనుగుణంగా పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు పారదర్శకంగా విధానాలను అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎన్ఎల్ఎం లీడర్ సంతోష్ ఫరీదా, సభ్యులు సూర్య ప్రదాన్, డ్వామా పీడీ సూర్యనారాయణ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరం
- రీసైక్లింగ్ పై దృష్టి సారించండి
- ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీయైన బనగానపల్లెకి రూ.5 లక్షల బహుమతి
- కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్ డా.పి.కృష్ణయ్య




మనగళం, నంద్యాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి అందుకు తగిన చేయూతను ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంస్థ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ డా.పి.కృష్ణయ్య సంబంధిత అధికారులు, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో కృష్ణయ్య (రిటైర్డ్ ఐఏఎస్) అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.... ప్లాస్టిక్ అనేది మనషుల జీవితంలో భాగస్వామ్యం అవ్వడం జరిగిందని వాటిని క్రమేపి తగ్గించడానికి అందరూ చేయూతను అందజేయాలన్నారు. ప్లాస్టిక్ అనేది ఎక్కువ శాతం డ్రైన్స్ లో నిల్వఉండడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం 2001లో నిషేధం ప్రకటించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం 2021లో నిషేధం విధించిందన్నారు. మున్సిపల్ ప్రాంతాల పరిధిలో ప్లాస్టిక్ ను నియంత్రించేలా కృషి చేయాల్సిన బాధ్యత కమీషనర్లపై ప్రాథమికంగా ఉందన్నారు. జిల్లా అధికారులు కూడా వారి సమీక్షలలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను అజెండాగా పెట్టుకొని ప్లాస్టిక్ నివారించడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో బనగానపల్లి పంచాయతీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా చేపడుతున్న చర్యలపై చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బనగానపల్లి గ్రామపంచాయతీకి రూ. ఐదు లక్షలు బహుమతి ప్రకటించారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నియంత్రించడానికి అనేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా నంద్యాల జిల్లాలో బనగానపల్లి గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగ్స్, చేతి సంచీలు వినియోగించడం పట్ల పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని చెప్పారు. సుమారుగా 70 శాతం ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించారని చెప్పారు. జిల్లాలో 8 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రణాళికల వారీగా క్లియర్ చేసామని కలెక్టర్ ఛైర్మన్ కు వివరించారు. అదేవిధంగా జిల్లాలో 11 ఈ వేస్ట్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు గాను దేవాలయాలలో ప్లాస్టిక్ బదులుగా వెదురుతో తయారుచేసిన కప్స్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. వీటి తయారీ ద్వారా చెంచుగూడాల లోని వారికి కూడా ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు అందరికీ చైర్మన్, కలెక్టర్ జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. సమావేశంలో డీఆర్ఓ డి.రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎపిఐఐసి జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, డీఎంజిఓ వేణుగోపాల్, వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమీషనర్లు లక్ష్మీ నాయక్, చందన హర్ష, డిటిసి ఐశ్వర్య రెడ్డి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, మార్కెటింగ్ ఏడీ రమణ, పరిశ్రమల శాఖ జీఎం ఎస్.మహబూబ్ బాషా, ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవీ లత, డిపిఓ లలితా బాయి, ఐసిడిఎస్ పిడి లీలావతి, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై సమీక్షా సమావేశం

మనగళం, నంద్యాల : నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై జిల్లా నోడల్ ఆఫీసర్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ పట్టణ శివారు ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి గుర్తించిన మారుమూల, దట్టమైన పొదలను తొలగించాలన్నారు. గంజాయి డ్రగ్స్ మొదలగునవి అక్రమంగా రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆన్లైన్ లో, కొరియర్ సర్వీసుల ద్వారా ఏదైనా మాదకద్రవ్యాలు రవాణాపై నిఘా ఉంచాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలో ఈగల్ కమిటీలు నిర్వహించి విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలు కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్కూలు కళాశాలలకు 100 మీటర్ల దూరంలో నిషేధిత పొగాకు,మాదకద్రవ్యాలు మొదలగు వస్తువులు విక్రయించే వ్యాపార సముదాయాలు ఉన్నాయేమో తనిఖీలు నిర్వహించి వాటిని పూర్తిగా అరికట్టాలన్నారు. గంజాయి, డ్రెస్ కేసులలో పట్టుబడిన ముద్దాయిలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనించాలని తెలిపారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 9 కేసులు నమోదు కాగా 15 కేజీల గంజాయిని సీజ్ చేయడం, 20 మందిని అరెస్టు చేయడంతో పాటు మూడు వాహనాలు సీజ్ చేయడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్ హనుమన్న, జిల్లా ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ రవికుమార్, ఆళ్లగడ్డ డీఎస్పి ప్రమోద్,నంద్యాల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, రైల్వే పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కుమారి, నంద్యాల డీఐఈఓ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు

మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు (28.07.2025) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి.

శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా



శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# శ్రీశైలం జలాశయం 7 గేట్లు 10 అడుగులు మేర ఎత్తివేత కొనసాగుతున్న వరద నీరు

మనగలం : శ్రీశైలం శ్రీశైలం జలాశయం 7 గేట్లు 10 అడుగులు మేర ఎత్తివేత

జూరాల నుండి జలాశయం. కి .1,48,619 క్యూసెక్కులు

సుంకేసుల.. నుండి 1,10,497 క్యూసెక్కులు

ఇన్ ఫ్లో : 2,59,116 క్యూసెక్కులు

ఔట్ ఫ్లో : 2,55,811 క్యూసెక్కులు

పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులు

ప్రస్తుతం : 883.00 అడుగులు

పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు

ప్రస్తుతం : 204.7880 టీఎంసీలు

కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



# నందీశ్వరస్వామికి విశేషపూజ



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (29.07.2025) ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది. ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# మల్లికార్జున స్వామి సేవలో మహాస్వామిజీ



మనగళం శ్రీశైలం : శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నా సిద్ధ రామ శివ చార్య మహాస్వామి దర్శించుకున్నారు. ఆలయ మహా ద్వారం వద్దకు చేరుకున్న మహాస్వామిజీకి ఈవోఎం శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు, ఇతర అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం





మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (29.07.2025) సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి. బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# డోన్ పట్టణంలోని చికెన్ వ్యాపారులను హెచ్చరించిన డిఎస్పి శ్రీనివాస్





మన గళం, డోన్, : ఇటీవల డోన్ లో చికెన్ వ్యాపారులు సిండికేట్ అయి ఒకే ధరకే ప్రజలకు అమ్మాలని, తక్కువ ధరకు అమ్మేవారిపై ఒత్తిడి తేవడం జరిగింది. ఈ క్రమంలోనే డోన్ డిఎస్పి శ్రీనివాస్ పట్టణంలోని చికెన్ వ్యాపారులు వారికి నచ్చినట్లు తక్కువ ధరకు ప్రజలకు విక్రయించవచ్చుకోవచ్చని, అలాకాకుండా తాము చెప్పిన ధరలకే విక్రయించాలని వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# శ్రీశైలం మల్లన్న సేవలో రిటైర్డ్ ఐఏఎస్



మనగళం శ్రీశైలం : శ్రీశైలం మహాక్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను రిటైర్డ్ ఐఏఎస్, ఏపీ విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునీత్ తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. ఈవోఎం శ్రీనివాసరావు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి శ్రీస్వామి అమ్మవార్ల చిత్రపటం, జ్ఞాపిక, లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (29.07.2025) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

# సాంస్కృతిక కార్యక్రమాలు






మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (28.07.2025) శ్రీ దుర్గా నృత్య కళానిలయం, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో గణపతికౌత్వం, మూషికవాహన, తాండవనృత్యం, ఓం నమశ్శివాయా, శివతాండవం తదితర గీతాలకు వైష్ణవి, చిత్ర్యశ్రీ, సౌమ్య తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు

## ప్రతి ఇంటికి యోగాను తీసుకువెళ్లండి



**- బి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్**

మన గళం, కర్నూలు సిటి : ప్రతి ఇంటికి యోగ సాధనను తీసుకువెళ్లేలా రాష్ట్ర యోగ సంఘం కృషి చేయాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏపీ బీజేపీ అధ్యక్షుడు కర్నూలు పర్యటన నేపథ్యంలో రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడు అవినాష్ శెట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో యోగాకు మంచి ప్రాచుర్యం కలిగిందంటే కేవలం ప్రధానమంత్రి మోడీతో సాధ్యమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చరిత్ర సృష్టించేలా విశాఖపట్నం వేదికగా యోగ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి అనేక రికార్డులను సాధించిందన్నారు. యోగ ఆంధ్ర విజయవంతంలో రాష్ట్ర యోగ సంఘం తో యోగ సంస్థలు కీలక పాత్ర పోషించాయి అన్నారు. అనంతరం యోగ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి మాట్లాడుతూ యోగ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తామని అన్నారు. యోగాంధ్ర ఇచ్చిన స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థల పరిధిలో యోగ శిక్షకుల ను నియమించి మంచి ఆరోగ్య సమాజాన్ని నిర్మించేలా చూడాలని బిజెపి అధ్యక్షుడు మాధవ్ ను అవినాష్ శెట్టి కోరారు.

## ఛాయ్ పే..చర్చ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర భాజపా చీఫ్ పి.వి.ఎన్.మాధవ్





మన గళం,కర్నూలు రాజవిహార్ : కర్నూలు నగరంలో మంగళవారం జరిగిన ఛాయ్ పే..చర్చ కార్యక్రమానికి రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ హాజరయ్యారు. నగరంలోని స్థానిక కర్నూలు క్లబ్ క్యాంటీన్ ఎదుట ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటుగా, కర్నూలు నగర ప్రముఖులను కలిసి, వారి మనోభావాలను,స్థానిక పరిస్థితులను తెలుసుకునేందుకే ఈ ఛాయ్ పే చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మార్పు అన్నది చిన్నగనే ఆరంభమై, ఆనక ఉద్యమ రూపం దాలుస్తుందన్నారు. ప్రపంచ గతిని,స్థితిన మార్చిన ఘటనలన్నీ చిన్నగనే ప్రారంభమవుతాయన్నారు. ఓ ఛాయ్ వాలా నుంచి ఆసాధారణ స్థాయిలో దేశ ప్రధానిగ ఎదిగిన నరేంద్ర మోదీయే అందుకు ఓ నిదర్శనమన్నారు. రాయలసీమలో భాజపా జెండా ఎగురవేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రగతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందన్నారు.

## లాయర్ రంగారెడ్డి జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రిలో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

మన గళం, డోన్ : న్యాయవాద వృత్తిలో డోన్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, సేవా సహృదయులు స్వర్గీయ కె.బి.యం రంగారెడ్డి సేవలు ఎనలేనివని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్ నాయుడు, సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం నాడు రంగారెడ్డి 17 వ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి కుటుంబ సభ్యులు స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన చేయించి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వందలాది మంది పల్లె ప్రజల ఆకలి తీర్చారు. అనంతరం కోర్ట్ ఆవరణలో లాయర్లకు, కోర్ట్ సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు, కోర్ట్ సిబ్బంది రంగారెడ్డికి నివాళులు అర్పించారు. ఆసుపత్రిలో అన్నదానం చేసిన రంగారెడ్డి కుమారుడు మహిపాల్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ హనీఫ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యస్.టి హరుణ్, శేషశయనరావు మధుసూదన్ రెడ్డి, జూనియర్ లాయర్లు, కోర్ట్ సిబ్బంది, స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి



మధు, రాజు యాదవ్, వసంత్ గౌడ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

# భారత జట్టులోకి ఐపీఎల్ బుడ్డోడు గ్రాండ్ ఎంట్రీ..

మన గళం : న్యూజిలాండ్‌ను ఢీ కొట్టేందుకు తొడ కొట్టిన వైభవ్ సూర్యవంశీ..?న్యూజిలాండ్‌తో టీమిండియా 5 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఫ్యూచర్ టూర్ ప్లాన్ ప్రకారం, 20 ప్రపంచ కప్ 2026 కి ముందు భారత్, న్యూజిలాండ్‌తో 5 మ్యాచ్‌ల 20 సిరీస్ ఆడుతుంది. రెండు జట్లు ఈ సిరీస్‌ను ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా తీసుకోవచ్చు. భారత జట్టులోకి ఐపీఎల్ బుడ్డోడు గ్రాండ్ ఎంట్రీ.. న్యూజిలాండ్‌ను ఢీ కొట్టేందుకు తొడ కొట్టిన వైభవ్ సూర్యవంశీ..? ఐపీఎల్, అండర్-19 టూర్‌లో తన విధ్వంసక బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అరంగేట్రం చేసే అవకాశం లభించవచ్చు. న్యూజిలాండ్‌తో జరగనున్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు టీమ్ ఇండియా జట్టులో చేరవచ్చని అంటున్నారు. న్యూజిలాండ్‌తో టీమిండియా 5 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఫ్యూచర్ టూర్ ప్లాన్ ప్రకారం, 20 ప్రపంచ కప్ 2026 కి ముందు భారత్, న్యూజిలాండ్‌తో 5 మ్యాచ్‌ల 20 సిరీస్ ఆడుతుంది. రెండు జట్లు ఈ సిరీస్‌ను ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా తీసుకోవచ్చు. ఈ సిరీస్ జనవరి 21 నుంచి ప్రారంభమవుతుంది. చివరి మ్యాచ్ జనవరి 31న తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతుంది. భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. యువ ఓపెనర్ శుభ్‌మాన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది.

వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం..!

14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ న్యూజిలాండ్‌తో జరిగే స్వదేశీ సిరీస్‌లో టీమ్ ఇండియా జట్టులో ఎంపికయ్యే అవకాశం ఉంది. ఈ యువ ఆటగాడు తన విధ్వంసక బ్యాటింగ్‌తో ఎంతగానో ఆకట్టుకున్నాడు. వైభవ్ ఐపీఎల్ 2025లో వెలుగులోకి వచ్చాడు. ఐపీఎల్‌లో అతి తక్కువ సమయంలో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన రికార్డును అతను సృష్టించాడు. గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో సెంచరీ చేసి చరిత్ర సృష్టించాడు.






Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310